## 3న 'ఠాణా దివస్': ఎస్పీ

చందుర్తి, సెప్టెంబర్ 30: చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 3న నిర్వహించే ఠాణా దివస్ కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్‌శాఖ కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ఇతివృత్తంగా క్షేత్ర స్థాయిలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని, ప్రజల నుంచి అర్జీలు స్వయంగా స్వీకరించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు ఠాణా దివస్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, గ్రామాల్లో నెలకొన్న శాంతిభద్రతల సమస్యలను చట్టపరంగా పరిష్కరించనున్నట్లు తెలిపారు.

## దళితుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

బోయినపల్లి/కోనరావుపేట, సెప్టెంబర్ 30: దళితుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని జిల్లా ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కమిటీ సభ్యుడు సుధాకర్ పేర్కొన్నారు. శనివారం ఆయన బోయినపల్లి మండలం కొత్తపేటలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి సంక్షేమ పథకాలతోపాటు ప్రత్యేకంగా దళితబంధు ప్రవేశపెట్టిందన్నారు. తర్వాత గ్రామాల్లోని ప్రధాన వీధులను కలియతిరిగి సౌకర్యాలను పరిశీలించారు. ఇక్కడ తహసీల్దార్ పుష్పలత, ఎంపీటీసీ ఐరెడ్డి గీత, నాయకుడు మల్లారెడ్డి, సర్పంచ్ నవిత ఉన్నారు.

● కోనరావుపేట మండలం భూక్యరెడ్డితండాలోని జీపీ కార్యాలయంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. అందరూ సమానమేనని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇక్కడ సర్పంచ్ లకావత్ ప్రమీల, ఉపసర్పంచ్ తిరుపతి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ జిల్లా కమిటీ సభ్యుడు లకావత్ తిరుపతి నాయక్, జీపీ కార్యదర్శి తిరుపతి, తదితరులు ఉన్నారు.

## 'స్వచ్ఛతా హీ సేవ'లో భాగస్వాములవ్వాలి

రుద్రంగి, సెప్టెంబర్ 30: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ తర్రె ప్రభలత సూచించారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఉపాధ్యాయులు, నాయకులు, ఈజీఎస్ కూలీలతో కలిసి సర్పంచ్ శ్రమదానం చేశారు. ఇక్కడ హెచ్‌ఎం శంకర్, నాయకులు తర్రె మనోహర్, పిడుగు లచ్చిరెడ్డి ఉన్నారు.

## స్వామివారికి ప్రత్యేక పూజలు

వేములవాడ టౌన్, సెప్టెంబర్ 30: రేవతి నక్షత్రం సందర్భంగా వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారికి శనివారం స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ప్రాతఃకాల పూజల అనంతరం 11మంది రుత్వికులు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీ అనంతపద్మనాభ స్వామివారికి పంచోపనిషత్తుల ద్వారా అభిషేకపూజలు చేశారు.

## బాధిత కుటుంబాలకు మనోహర్‌రెడ్డి పరామర్శ



శాత్రాజుపల్లిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మనోహర్‌రెడ్డి

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 30: మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో పలువురు ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మనోహర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. పొన్నాల లస్మవ్వ, పంగ దుర్గయ్య, గుడిసె పెద్ద మల్లయ్య కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు మునీందర్, సురేశ్, రమేశ్, బాలరాజు, రత్నయ్య, రాజు ఉన్నారు.

## ఐకార్‌లో విద్యార్థిని సత్తా

**● రాపెల్లి స్వాతికి ఆల్ ఇండియాస్థాయిలో 17వ ర్యాంకు**



రాపెల్లి స్వాతి

చందుర్తి,సెప్టెంబర్ 30: ఐకార్(ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ రీసెర్చ్)లో రాజన్నసిరిసిల్ల జిల్లా విద్యార్థిని సత్తా చాటింది. శనివారం విడుదలైన ఫలితాల్లో చందుర్తి మండలం నర్సింగాపూర్‌కు చెందిన రాపెల్లి స్వాతి ఆల్‌ఇండియా స్థాయిలో కమ్యూనిటీ సైన్స్ విభాగంలో 17 ర్యాంకు సాధించింది. గ్రామానికి చెందిన భాస్కర్-లక్ష్మి దంపతుల కూతురు స్వాతి చిన్నప్పటి నుంచే చదువులో చురుగ్గా ఉండేది. పాఠశాల, కళాశాల చదువును ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే పూర్తిచేసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్నది. స్వాతిని చందుర్తి ఎంపీపీ బైరగోని లావణ్య, సర్పంచ్ రాపెల్లి గంగాధర్ అభినందించారు. కాగా, తమ బిడ్డ ఐకార్‌లో మెరుగైన ర్యాంకు రావడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

# మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం



లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

**● చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

బోయినపల్లి, సెప్టెంబర్ 30: గ్రామాల్లో వివిధ సామాజిక వర్గాల వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. శనివారం ఆయన బూర్గుపల్లి నివాసంలో బూర్గుపల్లి మహిళా సంఘం, పద్మశాలీ సంఘ భవన నిర్మాణాలకు రూ.4లక్షల చొప్పున రూ.8లక్షల ప్రొసీడింగ్ కాపీలను అందజేసి, మాట్లాడారు. గ్రామాల్లో అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. అందుకు గానూ లక్షలాది రూపాయలు మంజూరు చేసిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు అమలు చేస్తున్నదని తెలిపారు. ఇక్కడ ఎంపీపీ వేణుగోపాల్, సర్పంచ్ లచ్చయ్య, కొండగట్టు ఆలయ కమిటీ సభ్యుడు రవి, నాయకుడు అంజన్‌రావు, తదితరులు ఉన్నారు.

## నేటి నుంచి అర్చకులకు శిక్షణ తరగతులు

వేములవాడ టౌన్, సెప్టెంబర్ 30: దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆదేశానుసారం ఉమ్మడి జిల్లాలోని ధూప, దీప నైవేద్యం స్కీంలో భాగంగా అక్టోబర్ 1 నుంచి 3 వరకు ఆలయ ఓపెన్ స్లాబ్‌పై శిక్ష ణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యా హ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు నమిలకొండ రాజేశ్వరశర్మ, చంద్రగిరి శరత్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకులకు పునశ్చరణ శిక్షణ తరగతులు నిర్వహిస్తామని అధికారులు వెల్లడించారు. శిక్షణ తరగతులకు వచ్చే అభ్యర్థులందరికీ భోజన సదుపాయం కల్పిస్తామని వారు వెల్లడించారు. కేటాయించిన తేదీల్లో శిక్షణ తరగతులకు హాజరై వారి సామర్థ్యం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని అధికారులు తెలిపారు.

# విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు

**● కౌన్సిల్‌లో సభ్యుల తీర్మానం ● వివరాలు వెల్లడించిన మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి**





మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి

వేములవాడ, సెప్టెంబర్ 30: వేములవాడ మున్సిపల్ విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులకు కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసినట్లు చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ఎజెండాలో పొందుపరిచిన అంశాలపై పాలకవర్గల సభ్యుతో చర్చించామన్నారు. సద్దుల బతుకమ్మ, దసరా పండుగ ఉన్నందున మున్సిపల్ నుంచి దాదాపు రూ.19.80లక్షలతో మూలవాగు ఏర్పాట్లు చేస్తామన్నారు. అలాగే విలీన గ్రామాల్లో సీసీ రోడ్లు, వైకుంఠధామాల నిర్మాణాలకు రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలు కేటాయించామన్నారు. మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రమేశ్‌బాబు సహకారంతో పెద్దఎత్తున నిధులు తీసుకువచ్చి పట్టణంలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. సమావేశంలో కమిషనర్ అన్వేష్, ఏఈలు నరసింహాస్వామి, పాలకవర్గ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డలకు 'కల్యాణ' కానుక

**● సిరిసిల్ల సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్‌గౌడ్ ● లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ**



మండెపల్లిలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ దేవదాస్‌గౌడ్, నాయకులు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 30: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా పేదింటి ఆడబిడ్డల పెండ్లికి సీఎం కేసీఆర్ కల్యాణ కానుకలు అందిస్తున్నారని సిరిసిల్ల సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్‌గౌడ్ కొనియాడారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో శనివారం ఆయన ముగ్గురు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఆడబిడ్డల పెండ్లి తల్లిదండ్రులకు భారంకావద్దని, సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారని తెలిపారు. ఇక్కడ సర్పంచ్ గణప శివజ్యోతి, ఎంపీటీసీ బుస్స స్వప్న, ఏఎంసీ డైరెక్టర్ వంగ తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నక్క రవి, నాయకులు గణప మదన్‌రెడ్డి, బుస్స లింగం, రాగిపెల్లి కిష్టారెడ్డి, ధర్మారెడ్డి ప్రశాంత్, ఆర్ఐ మధు ఉన్నారు. అదే విధంగా కస్బెకట్కూర్‌లో పలువురు లబ్ధిదారులకు వైస్ఎంపీపీ జంగిటి అంజయ్య, సర్పంచులఫోరం మండలాధ్యక్షుడు వలకొండ వేణుగోపాల్‌రావు కల్యాణలక్ష్మి చెక్కులను బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బెల్లె దేవయ్య, బందెల లక్ష్మణ్, బెల్లె తిరుపతి, ఇరిగాల శ్రీనివాస్‌తో కలిసి అందించారు. లక్ష్మీపూర్‌లో సర్పంచ్ మిట్టపల్లి పద్మ జవహర్‌రెడ్డి ముగ్గురికి కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఇక్కడ నాయకులు మిట్టపల్లి జవహర్‌రెడ్డి, అర్కుటి మహేశ్, అక్కనపల్లి కృష్ణభగవాన్, నాయిని సాయికృష్ణ, తక్కల కుశాల్, మునిగే మల్లేశం, మల్లారపు రమేశ్ ఉన్నారు. తాడూరులో ప్రత్యూషకు కల్యాణ లక్ష్మి చెక్కు, సుదీప్తికి రూ.1.50లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును సర్పంచ్ సురభి సరిత నవీన్‌రావు, ఎంపీటీసీ ములిగే దుర్గాప్రసాద్ అందించారు. ఇక్కడ ఉప సర్పంచ్ గంగాధర్, మధు, మహిళా సంఘ అధ్యక్షురాలు రాణి, నర్సయ్య, అంజయ్య తదితరులు ఉన్నారు. అలాగే బాలమల్లుపల్లెలో కీర్తి లావణ్యకు కల్యాణ లక్ష్మి చెక్కును సర్పంచ్ కస్తూరి లత, మాజీ సర్పంచ్ కస్తూరి తిరుపతిరెడ్డి, కార్యదర్శి మౌనిక, లలిత, దేవయ్య, కొమురయ్య అందించారు.

## స్వగ్రామం చేరిన గల్ఫ్ మృతదేహం

రుద్రంగి, సెప్టెంబర్ 30: మండల కేంద్రానికి చెందిన చిట్టపురం భూమేశ్వర్ (50) ఉపాధి నిమిత్తం కొన్నేండ్లుగా కువైట్ వెళ్లాడు. ఈ క్రమంలో అనారోగ్యంతో సెప్టెంబర్ 20న మృతి చెందగా, శుక్రవారం రాత్రి స్వగ్రామానికి మృతదేహం చేరింది. మృతదేహం ఇంటి వద్దకు రాగానే కుటుంబ సభ్యు లు బోరున విలపించారు. భూమేశ్వర్‌కు ముగ్గురు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## కిడ్స్‌కాన్వెంట్‌లో ఎల్లో డే వేడుకలు



వేములవాడ కిడ్స్ కాన్వెంట్ స్కూల్‌లో ఆకర్షణగా నిలిచిన విద్యార్థులు

వేములవాడ, సెప్టెంబర్ 30: పట్టణంలోని కిడ్స్‌కాన్వెంట్ హైస్కూల్‌లో ఎల్లో డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ధరక్షన్ వుసిప, కరస్పాండెంట్ నరాల దేవేందర్ మాట్లాడుతూ, ఎల్లో డే సందర్భంగా పసుపు రంగు పండ్లల్లో ఉండే పోషకాల గురించి వివరించామన్నారు. పసుపు రంగు విశిష్టతను విద్యార్థులకు వివరించామన్నారు. ఎల్లో కలర్ రైమ్స్ పాడుతూ, విద్యార్థులు సందడి చేశారు.

## దుబాయికి పారిపోయిన నిందితుడి అరెస్ట్

**● 15 రోజుల్లో స్వదేశానికి రప్పించిన పోలీసులు**

**● వివరాలు వెల్లడించిన డీఎస్పీ నాగేంద్రాచారి**

వేములవాడ, సెప్టెంబర్ 30: భార్యతో వివాహేతర సంబంధం ఉన్న వ్యక్తిని హత్య చేసి, కొన్ని గంటల్లోనే దుబాయి పారిపోయాడు. కాగా, ఆ నిందితుడిని 15 రోజుల్లోనే స్వదేశానికి రప్పించి, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం వేములవాడ డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో డీఎస్పీ నాగేంద్రాచారి వివరాలను వెల్లడించారు. చందుర్తి మండలం మల్యాల కు చెందిన కొండూరి మల్లేశం తన భార్యతో వివాహేతర సంబంధం ఏర్పాటు చేసుకున్న నరేశ్‌ను సెప్టెంబర్ 13న హత్య చేశాడు. అనంతరం కొన్ని గంటల్లోనే దుబాయికి పారిపోయాడు. వెంటనే హత్యకు సహకరించిన ఏ2 నిందింతడు లక్ష్మణ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఏ1గా ఉన్న మల్లేశంను దుబాయి నుంచి రప్పించేందుకు ప్రభుత్వ అనుమతితో దుబాయిలో మల్లేశం పనిచేస్తున్న కంపెనీపై ఒత్తిడి తీసుకువచ్చామన్నారు. దీంతో మల్లేశం అహ్మదాబాద్ ఏయిర్‌పోర్టుకు శుక్రవారం రాత్రి రాగా చందుర్తి సీఐ కిరణ్, ఎస్ఐ అశోక్ నేతృత్వంలో అరెస్టు చేశామన్నారు. మల్లేశంను రిమాండ్‌కు తరలించామన్నారు. హత్య చేసి తప్పించుకోలేరని, నిందితుడు ఎక్కడా ఉన్న చట్టం ముందు హాజరు పరుస్తామన్నారు. సమావేశంలో చందుర్తి సీఐ కిరణ్, ఎస్ఐ అశోక్, సిబ్బంది ఉన్నారు.

## వైద్య శిబిరానికి విశేష స్పందన

కోనరావుపేట, సెప్టెంబర్ 30: మామిడిపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటీ అధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించగా విశేష స్పందన లభించింది. ఈసందర్భంగా వృద్ధులు పెద్ద ఎత్తున శిబిరానికి తరలిరాగా దీర్ఘకాలిక వ్యాధులతోపాటు పలు వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇక్కడ ఉప సర్పంచ్ ఎల్లాల రాంరెడ్డి, నాయకుడు సాసాల మల్లారెడ్డి ఉన్నారు.